సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



అమ్మో.. కేన్సర్

జిల్లాలో కేన్సర్‌పై అవగాహన పెరగాల్సి ఉంది. వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతోంది. - 8లో



ముట్టుకుంటే షాకే

వానాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్త. పొలాల్లో రైతులు ఇంకా అప్రమత్తంగా ఉండాలి. - 8లో

సీఐలకు బదిలీ

శ్రీకాకుళం క్రైమ్: విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న ఐదుగురు సీఐలను జిల్లాకు స్థానచలనం చేస్తున్నట్లు డీఐజీ గోపీనాథ్ జట్టి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాతపట్నం సీఐ నల్లి సాయిని విశాఖ వీఆర్‌కు పంపారు. జిల్లాకు వచ్చిన వారిలో గుబ్బల శ్రీనివాసరావు(డీసీఆర్బీ), పీవీవీఎస్ఎన్ కృష్ణారావు (టాస్క్ ఫోర్స్), శాకందొర సూర్యచంద్రమౌళి (సీసీఎస్), ఎం.కృష్ణమూర్తి (డీటీసీ), వానపల్లి రామారావు (పాతపట్నం) ఉన్నారు.

న్యూస్‌రీల్

శ్రీకాకుళంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్, జేకేసీ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌పి.సురేఖ, జేకేసీ కోఆర్డినేటర్ వై.మణికుమార్ తెలిపారు. హెటిరో డ్రగ్స్ కంపెనీ ట్రైనీ ప్రొడక్షన్, ఆర్‌అండ్‌డీక్యూసీక్యూఏ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఆ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డిగ్రీ బీఎస్సీ, బీకాం, పీజీ ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ఉత్తీర్ణులై 26 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సోమవారం ఉదయం 9.30 గంటలకు సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 9949094968, 8919961110 నంబర్లను సంప్రదించాలన్నారు.

దూసి రైల్వే స్టేషన్ సందర్శన



దూసి రైల్వేస్టేషన్‌ను సందర్శించిన రైల్వే అధికారులు, ఇంటాక్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: దూసి రైల్వేస్టేషన్‌లో మహాత్మా గాంధీ స్మారక స్థలి ఏర్పాటు విషయమై పరిశీలించడానికి వచ్చామని ఈస్ట్ కోస్ట్ వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ అన్నారు. శనివారం దూసి రైల్వేస్టేషన్‌ను పవన్‌కుమార్ సందర్శించి మహాత్మా గాంధీ పర్యటించిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ ఇంటాక్ శ్రీకాకుళం చాప్టర్ ప్రతినిధులు కోరిన విధంగా ప్రతిపాదనలు తయారు చేస్తామని అన్నారు. అనంతరం శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరాన్ని అధికారుల బృందం సందర్శించింది. పర్యటనలో శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషను మేనేజర్ ఎం.రవి, శ్రీకాకుళం రోడ్ సీబీఎస్ఆర్ఎస్ శివశంకర్, దూసి రైల్వే స్టేషను సిబ్బంది లోకనాథం, మన్మధరావు సీటీఐ పాల్గొన్నారు.

రఘురామ, పంతంలను బహిష్కరించాల్సిందే

టెక్కలి: దళిత ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలను ఆయా పార్టీల నుంచి బహిష్కరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ బోకర నారాయణరావు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీను బహిరంగంగా చించిన రఘురామకృష్ణంరాజును, కాకినాడలో దళిత ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావుపై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

కాశీబుగ్గ: పలాసలో శ్రీవారికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, నాయకులు



అంతా రాజకీయమే..

❛ వేంకటేశ్వర స్వామి లడ్డూను కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నారు. తిరుమలలో అక్కడి ల్యాబ్‌లో చెక్ చేశాకే కల్తీ నెయ్యి విషయం బయటపడింది. కల్తీ నెయ్యి అని తేలాక వెనక్కి పంపించేశామని ఈఓ శ్యామలరావు కూడా చెప్పారు. కానీ చంద్రబాబు ఈ విషయాన్ని కావాలనే రాద్ధాంతం చేస్తున్నారు. చంద్రబాబునాయుడు హయాంలో కూడా 14 సార్లు నెయ్యి కల్తీ జరిగిందని టీటీడీ ల్యాబ్స్‌లో స్పష్టమైంది. దాని గురించి మాత్రం మాట్లాడరు. భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారు.❜

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

ఆమదాలవలస: వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆరోపణలు తగవు

❛ తిరుమల పవిత్రతను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వెంకటేశ్వర స్వామి కీర్తి ప్రతిష్టలు తగ్గించేలా ఆరోపణలు చేయడం చంద్రబాబుకు తగదు. లడ్డూలో కల్తీ జరగలేదని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఈఓ స్పష్టంగా చెప్పారు. కానీ చంద్రబాబు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం తగదు. గతంలో ఎన్నోసార్లు వైఎస్ జగన్ తిరుమల వెళ్లారు. ఎప్పుడూ లేని డిక్లరేషన్ ఇప్పుడు ఎందుకు..?❜

– తమ్మినేని సీతారాం, మాజీ స్పీకర్

పాపమంతా పాలకులదే..

దేవుడిని కూడా వదలకుండా రాజకీయం చేసేవారికి మంచి బుద్ధి ప్రసాదించాలని అంతా వేడుకున్నారు. ప్రసాదంపై బూటకపు ప్రచారం చేసిన వారి పాపం ప్రక్షాళన కావాలని మొక్కుకున్నారు. ప్రజల సమస్యలు గాలికి, ఇచ్చిన హామీలు గతానికి వదిలేసి విపక్షంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న అధికార పక్షానికి కాసింత చిత్తశుద్ధి ఇవ్వాలని విన్నవించారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు ఊరూరా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

● చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలని ఆలయాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం నారాయణతిరుమల ఆలయ ఆవరణలో ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఇతర నాయకులు



పొందూరు: కోటిపల్లి కూడలిలోని వేంకటేశుని ఆలయంలో పూజలు చేస్తున్న పార్టీ రాష్ట్ర కళింగ విభాగ అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు తదితరులు



మెళియాపుట్టి: వేణుగోపాల స్వామి ఆలయంలో 108 కొబ్బరి కాయలతో పూజలు నిర్వహిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎచ్చెర్ల క్యాంపస్: ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, నాయకులు



టెక్కలి వైభవ వేంకటేశ్వర ఆలయంలో హోమం చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



ఇచ్ఛాపురం: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నేతలు

చంద్రబాబు బుద్ధిని వెంకన్న స్వామే మార్చాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- నారాయణ తిరుమలలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాజకీయ లబ్ధి కోసం ఏకంగా వెంకన్న స్వామినే ఎంచుకోవడం సీఎం చంద్రబాబుకే చెల్లిందని, ఆయనకు దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కోరారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలో పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ లడ్డూ పేరిట రాజకీయం చేస్తూ వెంకన్నస్వామి ఆలయానికి సైతం అప్రతిష్ట తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు అండ్ కో వక్రబుద్ధిని మార్చుకోవాలన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా అమలుచేయకుండా ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికే లడ్డూ కల్తీ సబ్జెక్ట్‌ని ఎంచుకున్నారని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుమల వెళ్తానంటే అడ్డుకోవడం దారుణమన్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఎంతగానో కృషి చేశామని, వీటిన్నింటినీ మీడియా సమావేశంలో జగన్ చూపించారన్నారు. దివంగత వైఎస్సార్, జగన్‌మోహన్ రెడ్డిలు ఎన్నిసార్లు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారో మీకు తెలియదా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ పాదయాత్రకు ముందు తర్వాత కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నా ఇంకా మీకు అనుమానం ఎందుకో చెప్పాలన్నారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు కోట్లాదిమంది స్వామి భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కళింగ వైశ్య, తూర్పు కాపు విభాగ అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, ఎంవీ స్వరూప్, రౌతు శంకరరావు, సాధు వైకుంఠరావు, చల్ల రవి, గొండు కృష్ణమూర్తి, ఎన్ని ధనుంజయరావు, శిమ్మ రాజశేఖర్, పొన్నాడ రుషి, టి.కామేశ్వరి, పీస గోపి, అంబటి శ్రీను, గొండు రఘురాం, కిల్లి సత్యనారాయణ, బగ్గు అప్పారావు, అలపాన త్రినాథరెడ్డి, యజ్జల గురుమూర్తి, కనపల తేజ, చింతాడ వరుణ్, గార, రూరల్ నాయకులు పాల్గొన్నారు.

● జాతీయ స్థాయి హాకీ పోటీలకు చిన్ని



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి హాకీ పోటీలకు జిల్లాకు చెందిన చింతాడ చిన్ని ఎంపికైంది. శ్రీకాకుళం డీఎస్ఏ క్రీడామైదానం (పాత్రునివలస)లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఉత్తమప్రదర్శన కనబర్చిన చిన్ని జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ పోటీలు జార్ఖండ్‌లోని రాంచీ వేదికగా ఈనెల 30వ నుంచి అక్టోబరు 10వ తేదీ వరకు జరగనున్నాయి. క్రీడాకారిణిని జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు పంచిరెడ్డి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి జరుగుళ్ల రమేష్ అభినందించారు.

● 23 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్



కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలో 23 మంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు కోటబొమ్మాళి డ్వామా కార్యాలయానికి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. గత ఏడాది ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడ్డారని, ఆ మేరకు వారి నుంచి రూ.7.20 లక్షల సొమ్మును రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. మహసాహెబ్‌పేట, నారాయణవలస, దంత, కొత్తపల్లి, శ్రీజగన్నాథపురం- 2, యలమంచిలి-2, కొత్తపేట, కురుడు, సరియాపల్లి, లఖందిడ్డి, గంగరాం, జర్జంగి, రేగులపాడు, ఎత్తురాళ్లపాడు, పెద్దబమ్మిడి, తాటిపర్తి, కిష్టుపురం, శ్రీపురం, హరిశ్చంద్రపురం-1 గ్రామాలతోపాటు మరో నాలుగు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కోటబొమ్మాళి డ్వామా ఏపీఓ పూతి హరిప్రసాద్ శనివారం తెలిపారు. ఆ మేరకు ఉత్తర్వులను పోస్టు ద్వారా పంపినట్లు పేర్కొన్నారు.

8.160 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల అన్న క్యాంటీన్ సమీపంలో 8.160 కిలోల గంజాయితో ఒడిశాకి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. సీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఒడిశాలోని గంజాం జిల్లా పొలసర గ్రామానికి చెందిన సింహాచలం మహంతి అనే వ్యక్తి ఒడిశాలో బడగొల గ్రామానికి చెందిన ప్రమోద్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి గుజరాత్‌లో కలియా అనే వ్యక్తికి అందజేయడానికి బరంపురం నుంచి ఇచ్ఛాపురం బస్సు ద్వారా శుక్రవారం చేరుకున్నాడు. బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్తుండగా పట్టణ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సింహాచలం మహంతి వద్దగల బ్యాగ్‌లో 8.160 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితుని వద్ద నుంచి అక్రమ గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు

జెడ్పీలో బదిలీలు ప్రశాంతం

అరసవల్లి: జిల్లా పరిషత్‌లో తాజాగా జరిగిన ఉద్యోగుల బదిలీల ప్రక్రియ అంతా ప్రశాంతంగా ముగిసిందని, ఇందుకు కారకులైన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లుగా జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కిలారి నారాయణరావు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బదిలీల విషయంలో ఎక్కడా అక్రమాలకు తావులేకుండా మొత్తం 268 మంది ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టినందుకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సీఈఓ ఆర్.వెంకటరామన్ కృషి ప్రశంసనీయమన్నారు. అలాగే ప్రభుత్వం తరఫున మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు పంచాయతీరాజ్ ఉద్యోగుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ప్రకటించారు.

పాఠశాల హెచ్‌ఎంపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు



దండాసి అరుణ

కోటబొమ్మాళి: పాకివలస ప్రాథమిక పాఠశాల హెచ్ఎం షణ్ముఖరావు, విద్యా కమిటీ చైర్మన్ దేవాది సింహాచలంపై అదే పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న దండాసి అరుణ శనివారం మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. తాను వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపాననే అక్కసుతో స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడితో తనను విధుల నుంచి తొలగించారని, మానసికంగా వేధిస్తున్నారని, ఈ ఘటనపై తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో కోరారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

గార: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం మండలంలోని లింగాలవలస సచివాలయం వద్దనున్న లేఅవుట్, అర్బన్ లే అవుట్లను పరిశీలించారు. మన ఇళ్లు–మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ఇంటి పనులు పూర్తి చేసిన వారికి బిల్లులు మంజూరు చేస్తామన్నారు. లింగాలవలస లే అవుట్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అర్బన్ లే అవుట్ పనులు నత్తనడకన ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసి పనులు వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు.



లింగాలవలస లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రోడ్డుపై ఆటోల శబ్దం వినిపించక ముందు.. ఇన్ని రకాల మోటారు బైక్‌లు పురుడు పోసుకోక మునుపు.. రిక్షా రాజ్యమేలింది. ధనిక వర్గానికి అలవాటుగా, మధ్య తరగతి జీవికి హోదాగా, బడుగు బతుకులకు తోడుగా రిక్షా మూడు చక్రాలపై ఠీవిగా నడిచింది. సెకండ్ షో సినిమా నుంచి సురక్షితంగా ఇంటికి తీసుకువచ్చింది. సాయంత్రం సరదాగా నాగావళికి షికారుకు తీసుకెళ్లింది. నాటి అడ్వకేట్లను, అర్చకులను, పండితులను నిత్యం హోటళ్లకు తిప్పింది. యంత్రాల రాకతో రిక్షా మూలకు చేరింది. జిల్లా కేంద్రంలో ఇప్పటికీ కొందరు రిక్షావాలాలు ఉన్నారు. పిల్లలను డిగ్రీ వరకు చదివించుకుని ఆ రిక్షానే ఆధారంగా చేసుకుని బతుకు బండిని లాగుతున్నారు.



మార్కెట్‌లో రిక్షా కార్మికులు

జీవన సమరం రిక్షావాలా

బతుకు ఓ పరిక్షా

- మరుగున పడిన రిక్షా వాలా
- బతుకంతా రిక్షా తొక్కిన శ్రామికులు
- ఎదుగుబొదుగు లేని జీవితాలు

శ్రీకాకుళం కల్చరల్:

ఇప్పుడు కాదు గానీ.. ఓ నలభై ఏళ్ల కిందట శ్రీకాకుళం ఎలా ఉండేదో తెలుసా..? పెద్ద పల్లెటూరులా ఉండేది. ఏడురోడ్ల కూడలి, సూర్యమహల్ కూడలి, ఇల్లీసుపురం, అరసవల్లి కూడలి వద్ద పసగాడ సూర్యనారాయణ మిల్లు కూడలి, పాతబస్టాండు, పందుంపుల్ల కూడలి, పాతశ్రీకాకుళం, గుజరాతీపేట సెంటర్లలోనే జనం తిరిగేవారు. అప్పట్లో సైకిల్, మూడు చక్రాల రిక్షాలు మాత్రమే ప్రయాణ సాధనాలు. ఒకటి కాదు రెండు కాదు అప్పట్లో వందల్లో నగరంలో రిక్షాలు తిరిగేవంటే అతిశయోక్తి కాదు.

ప్రస్తుతం పదుల సంఖ్యకు చేరుకున్నాయి. అందులో గూడు రిక్షాలు నడిపేవారు అంతా కలిపి 50వరకే మిగిలారు.

అదో హుందా..

ఒకప్పుడు రిక్షా ప్రయాణం హుందాతనానికి గుర్తు. పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లి తేవడం, ఆఫీసులకు వెళ్లే వాళ్లు, జిల్లా కోర్టుకు వెళ్లడానికి లాయర్లు, కొంతమంది ప్రముఖులు కాఫీ తాగేందుకు హోటల్‌కు, సినిమాలకు వెళ్లడానికి ఎక్కువగా వాడేవారు. ప్రతి రోజూ వెళ్లే వారు ప్రత్యేకంగా ఒక రిక్షాను వారు రోజు వెళ్లే అదే సమయానికి రమ్మని చెప్పి వెళ్లడం పరిపాటి. రెండో ఆట సినిమా హాలుకు వెళ్లే వారి కోసం సినిమా వదిలిన వెంటనే అక్కడ అధిక సంఖ్యలో రిక్షాలు రెడీగా ఉండేవి.

ట్రాలీ రిక్షాలతోనే..

రిక్షా తొక్కీ తొక్కీ చాలా మంది అనారోగ్యం పాలయ్యారు. ఇప్పుడు తమ బళ్లను ట్రాలీ బళ్లుగా మార్చుకున్నారు. ప్రస్తుతం దానిపైనే ఆదాయం వస్తోంది. షాపుల నుంచి సరుకులను బస్టాండుకు, బస్టాండు నుంచి షాపులకు ట్రాన్సుపోర్టు చేస్తున్నారు. దీంతో గిరాకీ బాగుంది. కానీ పరుగులు పెడుతున్న ఈ ప్రపంచంతో పోటీ పడలేక రిక్షా లాగే నెమ్మదిగా బతుకు బండిని లాగుతున్నారు.

తగ్గిన వినియోగం..

మోటారు వాహనాల రాకతో రిక్షాలన్నీ మూలకు చేరిపోయాయి. 40 ఏళ్ల క్రితం నాటి వాళ్లే ఇంకా రిక్షాను తొక్కుతూ చాలీచాలని సంపాదనతో జీవితాలను గడుపుతున్నారు. కొంతమంది ఇప్పటికీ తమ పిల్లలను స్కూలుకు పంపేందుకు రిక్షాలను వాడుతున్నారు. గతంలో రిక్షా ద్వారా రూ.50 నుంచి రూ.70 వరకు సంపాదించేవారు. ప్రస్తుతం వారు రోజుకు రూ.150లు నుంచి రూ.400 వరకు సంపాదిస్తున్నారు.




మూటలను ట్రాలీ రిక్షాపై తీసుకెళుతూ...

❛ అప్పుడే బాగుండేది..



నా పేరు పుక్కళ్ల నీలయ్య నగరంలోని దమ్మలవీధిలో ఉంటున్నాను. నేను 1982లో మొదటిగా రిక్షా తొక్కడం మొదలు పెట్టాను. 40 ఏళ్లుగా రిక్షా తొక్కుతున్నాను. ఇప్పటికీ నేను రిక్షా కార్మిక సంఘం నాయకునిగా ఉంటున్నాను. మేము రిక్షా తొక్కుతున్న కొత్త రోజుల్లో పట్టణ పరిధి ఎంతో చిన్నది. ఏడు రోడ్ల కూడలి, గుజరాతీపేట, ఇలిసిపురం, జిల్లా కోర్టు, సూర్యమహల్, పాతబస్టాండు అరసవల్లి రోడ్డులోని నారాయణ మిల్లు, పాతశ్రీకాకుళం మాత్రమే ఉండేది. ప్రతి సెంటర్‌లో 40 రిక్షాలు వరకు ఉండేవి. ఉదయం స్కూళ్లకి, ఆఫీసులు, కోర్టుకు వెళ్లే లాయర్లతో చాలా బిజీగా ఉండేవాళ్లం. రాత్రి సెకెండ్ షో సినిమా వదిలే సమయానికి మేమందరం అక్కడికి చేరేవాళ్లం. ఎంతో పని ఉండేది. రోజుకు రూ.50 నుంచి రూ.70 వరకు సంపాదించేవాళ్లం. ఇప్పుడు జనం రిక్షాలు ఎక్కడం మానేశారు.

నాటి జ్ఞాపకాలు ఇవే...



❛ ప్రముఖ జ్యోతిషవేత్త మూగుల ప్రకాశం రో జూ హోటల్‌కు రిక్షాపై వెళ్లి కాఫీ తాగి వచ్చేవారు. అలాగే ప్రముఖ లాయరు సోదరులు కొల్లూరు రామబ్రహ్మం, సుబ్రహ్మణ్యంలు ఇద్దరు కలిసి కోర్టుకు రిక్షాపైన వెళ్లేవారు. పుణ్యపువీధిలో ఉండే ఆడిట్ ప్రాక్టీషనర్ సుమారుగా 40ఏళ్లుగా రిక్షాపైన రోజూ సాయంత్రం షికారుకు వెళ్లే వారు. కరోనా వచ్చిన తరువాత తగ్గించి, అప్పుడప్పుడు ఇప్పటికీ రిక్షాపై వెళుతుంటారు. అప్పటి కాలంలో కొందరు షావుకార్లు రిక్షా కొనుక్కోడానికి డబ్బులు ఇచ్చేవారు. ఎప్పుడైనా ఆ షావుకారు ఎక్కడికైనా వెళ్లాలంటే ఈ రిక్షాలో ఫ్రీగా వెళ్లేవారు.❜ అని రిక్షా కార్మికులు నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.



క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య తెలిపారు. పాఠశాలకు చెందిన టీ.సంతు, ఎస్.కల్పన అండర్-19 విభాగంలో సాఫ్ట్‌బాల్ క్రీడల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినుల ఎంపికపై పాఠశాల పీడీ రూప హర్షం వ్యక్తంచేశారు.

ముగిసిన డ్రోన్ టెక్నాలజీ శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో వర్సిటీ పరిశోధన, అభివృద్ధి కేంద్రం- రోసిస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటివ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ ఐదు రోజుల పాటు నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీ శిక్షణ శనివారంతో ముగిసింది. మూడు రోజులు పాటు థియరీ, రెండు రోజుల పాటు ప్రయోగాలు నిర్వహించారు. సాంకేతిక నిపుణులు డ్రోన్ టెక్నాలజీ, పనితీరు, పైలెట్ ప్రాధాన్యత, ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ వినియోగిస్తున్న విధానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు వీసీ కేఆర్ రజిని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి మాస కల్యాణ సేవ శనివారం ఉదయం వేద మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా జరిగింది. భాద్రపద బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో ప్రత్యేక మండపంలో వేంచేసింపజేశారు. అనంతరం ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కళ్యాణ సేవను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈఓ వై.భద్రాజీ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పలాస విద్యార్థిని



పొందర శ్రావణి పాత్రో

కాశీబుగ్గ: జమ్మూ కశ్మీరులో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4వరకు జరగనున్న 36వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పొందర శ్రావణిపాత్రో ఎంపికైంది. దీంతో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌వీ జోగారావు, అధ్యక్షుడు సంతోష్‌కుమార్ మల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, తమ్మినాన చిట్టిబాబు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ శాఖ ఏఈల బాధ్యతల స్వీకరణ


అరసవల్లి: విద్యుత్ శాఖ శ్రీకాకుళం డివిజన్ పరిధిలో డి-1 ఏఈగా జె.సురేష్‌కుమార్‌ను, డి-2 ఏఈగా తిరుపతిరావులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సాధారణ బదిలీల్లో భాగంగా వీరు కొత్త స్థానాల్లో బాధ్యతలను చేపట్టారు. అనంతరం వీరు మర్యాదపూర్వకంగా సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఆపరేషన్స్ ఈఈ యోగేశ్వరరావు, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్‌లను కలిశారు.

వీఆర్ఓపై దాడి

బూర్జ: అన్నంపేట గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మి మన్యం జిల్లా పాలకొండ మండలం బాసూరు గ్రామంలో వీఆర్ఓగా పనిచేస్తున్నారు. ఆమె శనివారం విధుల నుంచి గ్రామానికి వచ్చి వేరే చోటకు వెళ్తుండగా గ్రామానికి చెందిన సోమరాజు యర్రయ్య కుమారుడు సోమరాజు పవన్ దాడి చేశాడు. ఆమెతో పాటు తల్లి మంగమ్మపై కూడా దాడికి దిగాడు. ఇటీవల జరిగిన ఓ ఘటనకు సంబంధించిన గొడవలను మనసులో పెట్టుకుని గొడవకు దిగాడని వీఆర్ఓ తెలిపారు. గాయపడిన ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వారి సూచనల మేరకు శ్రీకాకుళం రిమ్స్‌లో చేరారు.

అమ్మో.. కేన్సర్

- కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే మేలు
- జిల్లాలో 4700 మంది కేన్సర్ బాధితులు
- పొగాకు వినియోగం వల్లనే అధిక కేసులు
- కౌన్సిలింగ్ ద్వారా పొగాకు మానిపించేందుకు చర్యలు



కేన్సర్ పేషంట్లకు ట్రీట్‌మెంట్ చేసే పరికరం

శ్రీకాకుళం కల్చరల్: ఆధునిక జీవన శైలి, పూర్తిగా మారిపోయిన ఆహారపు అలవాట్లు సరికొత్త రోగాలకు కారణమవుతున్నాయి. అందులోనూ కేన్సర్ వంటి మహమ్మారులు మన జిల్లాను కూడా వదిలి పెట్టడం లేదు. జిల్లాలో 4700 మంది వరకు కేన్సర్ బాధితులు ఉన్నారు. వీరిలో 2500 మంది వరకు జిల్లాలోనే ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాలకు వెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. అయితే ఈ బ్యాధి బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతుండడం ఆందోళన కలిగించే అంశం.

ప్రాథమిక దశలో గుర్తిస్తే..

వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వ్యాధి తగ్గిపోతోంది. కానీ చాలా మంది అశ్రద్ధ చేయడం వల్ల 3,4 స్టేజీల వరకు పట్టించుకోకపోవడంతో అది ముదిరి ఎటువంటి ట్రీట్ మెంట్ ఇచ్చినా సరే తగ్గడం లేదని వైద్యులు అంటున్నారు. ప్రతి ఒక్కరూ కేన్సర్ లక్షణాలను తెలుసుకుని ముందుగానే స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవాలని డాక్టర్లు చెబుతున్నారు.

జిల్లాలో ఇవే ఎక్కువ..

జిల్లాలో పొగాకు వల్ల వచ్చే కేన్సర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అడ్డ పొగాకు వాడేవారికి నోటి కేన్సర్ సోకుతోంది. సిగరెట్లు వాడడం వల్ల లంగ్ కేన్సర్ వస్తుంది. నోటి కేన్సర్‌లో అంగుటి క్యాన్సర్, నాలుక క్యాన్సర్, బుగ్గ కేన్సర్లు వస్తాయి. మహిళల్లో ఎక్కువగా గర్భాశయ ముఖ ద్వారం(సర్వికల్ కేన్సర్), రొమ్ము కేన్సర్ (బ్రెస్ట్ క్యాన్సర్)లు కనిపిస్తున్నాయి. వీటిలో రొమ్ము కేన్సర్ లక్షణాలను ఎవరికి వారే ముందుగానే గుర్తించి జాగ్రత్త పడవచ్చు.

చికిత్స ఉంది..

కేన్సర్ ట్రీట్‌మెంటు మూడు రకాలుగా ఇస్తారు. రేడియోథెరపీ, కీమోథెరపీ, సర్జరీల ద్వారా కేన్సర్ తగ్గించేందుకు వైద్యులు ట్రీట్‌మెంట్ చేస్తుంటారు. మొదటి రెండు దశలలో దీన్ని సమూలంగా నాశనం చేయవచ్చని వైద్యులు అంటున్నారు. 3,4 స్టేజిలలో కొంచెం కష్టం. సర్వికల్ కేన్సర్‌కు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేసుకోవాలని చెబుతున్నారు. దీన్ని 9-26ఏళ్ల వయసుగల బాలికలకు వేయిస్తే కేన్సర్ బారి నుంచి తప్పించుకోవచ్చని అంటున్నారు.



గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కౌన్సిలింగ్ ఇస్తున్నాం



పొగాకు మానలేని వారికి కౌన్సిలింగ్‌తో పాటు చికిత్స అందిస్తున్నాం. పొగాకు వాడకం వల్ల ఎక్కువగా కేన్సర్ వస్తుంది. దాన్ని మానెయ్యాలి. మహిళలకు గర్భాశయ ముఖద్వారం కేన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌లు వస్తున్నాయి. ఇక్కడ మంచి ట్రీట్‌మెంటు ఇస్తున్నాం.

– డాక్టర్ ముట్నూరు వెంకటరమణ, అంకాలజిస్టు, జెమ్స్ వైద్యకళాశాల హెచ్‌ఓడీ

సర్వికల్ కేన్సర్‌పై అవగాహన



జిల్లాలో మహిళల్లో వచ్చే సర్వికల్ కేన్సర్(గర్భాశయపు ముఖ ద్వారం)పై అవగాహన కల్పిస్తున్నాం. ముందస్తుగా బాలికలకు వీటిపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నాం. మా ఫౌండేషన్ ద్వారా ఉచితంగా 200మందికి హెచ్‌పీవీ వేక్సిన్ వేయించాం.

– యార్లగడ్డ గీత, గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు

ముట్టుకుంటే షాకే

- వానాకాలంలో విద్యుత్‌తో భద్రం
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన



హిరమండలం విద్యుత్ సబ్‌స్టేషన్

హిరమండలం: ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడుతున్న తరుణంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లు, రోడ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ ఆస్తి నష్టాలు తప్పవు. ముఖ్యంగా పొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. వర్షంలో వైర్లు తెగిపడినట్లు గుర్తిస్తే వాటి దగ్గరకు వెళ్లకుండా ఆ శాఖ వారికి సమాచారం ఇవ్వాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తడి చేతులతో తీగలు,స్విచ్‌లు తాకవద్దు.
- విద్యుత్ సంబంధిత మరమ్మతులు సొంతంగా చేయకూడదు.
- సిబ్బంది సెల్‌ఫోన్ నంబర్లు దగ్గర పెట్టుకోవాలి.
- వీధుల్లో, పొలాల్లో తడిచిన స్తంభాలను తాకకూడదు.
- తోటలు, పొలాలు వంటి ప్రదేశాల్లో విద్యుత్ తీగలు పడితే 1912కు కాల్ చేయాలి.
- విద్యుత్ తీగలపై బట్టలు ఆరేయకూడదు.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే సరఫరా నిలిపివేయాలి. బాధిత వ్యక్తిని ప్లాస్టిక్ లేదా ఎండిన కర్రతో వేరుచేయాలి.

జాగ్రత్తలతోనే నివారణ సాధ్యం



వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. వీధిలో గాలి వర్షాలకు తీగలు తెగి పడితే వెంటనే సమాచారం అందించాలి. మరమ్మతులు చేయిస్తాం. విద్యుత్ సమస్యలపై వెంటనే సమాచారం ఇవ్వాలి.

– ప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీ, పాతపట్నం

ర్యాబిస్ టీకాపై అవగాహన



పర్లాకిమిడిలో సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ మెడికల్ విద్యార్థులు

పర్లాకిమిడి: ప్రపంచ ర్యాబిస్ దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ, జంతువిజ్ఞాన స్కూల్ మెడికల్ విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాబిస్ టీకా వేయించుకుందాం.. ర్యాబిస్ నుంచి దూరంగా ఉందాం అంటూ నినాదాలు చేశారు. వెటర్నరీ స్కూల్ డీన్ డాక్టర్ రాజ్‌కిషోర్ స్వయిని మాట్లాడుతూ రేబిస్ ప్రాముఖ్యతను వివరించారు. పెంపుడు కుక్కలకు టీకా వేయించాలన్నారు. ర్యాలీలో వెటర్నరీ, అగ్రికల్చర్ డీన్ (అడ్మిన్) డాక్టర్ ఎస్‌పీ. నందా, ప్రత్యేక మెడిసిన్ డాక్టర్ జయతంగరాజ్, సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం: పోరాడి సాధించిన విశాఖ ఉక్కును ప్రజలంతా ముందుకు వచ్చి పరిరక్షించుకోవాలని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. అక్టోబర్2న విశాఖలో నిర్వహించనున్న ఉక్కు పరిరక్షణ శాంతి యాత్రపై శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియం వద్ద శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర న్యాయ సలహాదారు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ జగన్నాథరావు, కుల వివక్ష నిర్మూలన సంఘం అధ్యక్షులు బెలమర ప్రభాకర్, అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధి రాకోటి రాంబాబు తదితరులు ల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



రాష్ట్రస్థాయి క్రీడల పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) నుంచి అండర్-18 విభాగంలో 400 మీటర్ల రన్నింగ్‌లో రెడ్డి శివసాయి, షార్ట్‌పుట్‌లో పి.రామారావు రాష్ట్ర స్థాయి క్రీడలు పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం పట్టణంలోని ఈ నెల 27న నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశం తెచ్చుకున్నారు. ఈ విద్యార్థులను శనివారం డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి అభినందించారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని సూచించారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్యాంపస్‌లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

కూలి రేటు పెంచాలని డిమాండ్



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాంలో పనిచేస్తున్న హమాలీలకు కూలి రేటు పెంచాలని జిల్లా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో బేవరేజెస్ యూనిట్ సమీపంలో సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీల సమావేశం నిర్వహించారు. రూ.7.35 నుంచి రూ. 9కు కూలి రేటు పెంచాలని కోరారు. ధరలన్నీ 200 శాతం పెరిగాయని, జీవన ప్రమాణాలు భారమైన నేపథ్యంలో కూలి చెల్లింపులో మార్పులు చేయాలని చెప్పారు. హమాలీల వేతనంపై సమగ్ర చట్టం తేవాలని, చట్టాలకి లోబడి వేతనం మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఏడాదికి రెండు యూనిఫాంలు ఇవ్వాలని, విశ్రాంతి గదులు, మరుగు దొడ్లు నిర్మించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. యూనియన్ నాయకులు వి.కొండలరావు, బంగారాజు, రాము, రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

6న ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ

పలాస: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో అక్టోబరు 6న ఆదివారం ఉద్దానం కిడ్నీ విషాదాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు రచయత, తెలుగుభాషా జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు తెలిపారు. ఈ పుస్తక ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా ద్రవిడియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ కేఎస్ చలం హాజరు కానున్నట్లు తెలిపారు.

పోలెండ్ కార్మికుల ఔదార్యం



మృతుడి భార్య మాణిక్యంకు నగదు అందజేస్తున్న తోటి కార్మికులు

ఇచ్ఛాపురం రూరల్: తోటి కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి తామున్నామంటూ అండగా నిలిచారు స్నేహితులు. ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి గురుమూర్తి పోలెండ్‌లో వలస కార్మికుడిగా పనిచేస్తూ కిడ్నీ వ్యాధి బారినపడ్డాడు. ఆయన చికిత్సకు ఇటీవల 'పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం' వారు రూ.1,51,000లను ఆర్థిక సాయం అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. చికిత్స పొందుతూ మృతి చెందిన గురుమూర్తి కుటుంబానికి 'పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం' స్పందిస్తూ శనివారం రూ.లక్షా10వేలు అందజేశారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సత్కారం అందుకుంటున్న మోనీ మదస్వామి, రబినారాయణ సుబుద్ధి

పర్లాకిమిడి: వికసిత్ భారత్, వినూత్న వ్యాపారం, వ్యవసాయం, టెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సెంచూరియన్ వర్సిటీలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో సెంచూరియన్ వర్సిటీ డాక్టర్ సుప్రియా పట్నాయిక్ పాల్గొన్నారు. చివరి రోజు బహుమతి ప్రదానోత్సవంలో డాక్టర్ అతుల్ జినిజీ వెస్టన్ సిడ్నీ విశ్వవిద్యాలయం, ఢిల్లీలోని ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్ ప్రొఫెసర్ మోనీ మదస్వామి, మలేసియా మోనాష్ వర్సిటీ డిప్యూటీ హెడ్ డాక్టర్ అవ్వారి మోహన్‌లను సత్కరించారు.

అప్పన్న మృతదేహం లభ్యం

సోంపేట: మండలంలోని బారువ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు రట్టి అప్పన్న సముద్రంలో గల్లంతైన మూడు రోజుల తర్వాత కవిటి మండలం ఒంటూరు సముద్ర తీరం వద్ద ఆయన మృతదేహం శనివారం లభ్యమైంది. మెరైన్ పోలీసులు మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అప్పన్న మృతితో బారువ కొత్తూరు గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

భవిష్యత్‌లో ఆకస్మిక తనిఖీలు ఉంటాయి

- ప్రధానోపాధ్యాయుల సమీక్షలో పాఠశాల విద్య ఆర్జేడీ విజయభాస్కర్



మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్జేడీ విజయభాస్కర్, డీఈఓ, డీవైఈఓలు, ఏసి

శ్రీకాకుళం న్యూకాలనీ: బడుల్లో నాణ్యమైన విద్యను అందించే దిశగా ఉపాధ్యాయులంతా నిర్విరామంగా కృషి చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ)జోన్-1 బి.విజయభాస్కర్ ప్రధానోపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని కేఆర్ స్టేడియం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళా వేదికలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల శ్రీకాకుళం నగరంలోని ఎచ్చెర్ల వీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పాఠశాల తనిఖీలో ప్రభుత్వం అందిస్తున్న విద్యపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తనిఖీలకు వచ్చే వారిని గౌరవ మర్యాదలతో కాకుండా విద్యా బోధనలపై సంతృప్తి పరచాలని సూచించారు. భవిష్యత్‌లో ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, ఉపాధ్యాయులు అంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విద్యార్థుల చదువుతో పాటు వారి రక్షణ బాధ్యత కూడా ఉపాధ్యాయులదేనని తెలిపారు. డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య మాట్లాడుతూ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులు పట్ల అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు కూడా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. విద్యా క్యాలెండర్, పాఠశాల భద్రత, మధ్యాహ్న భోజనం, పాఠశాల ప్రొఫైల్స్, పని సర్దుబాటు, స్కూల్ కాంప్లెక్స్‌ల రీ ఆర్గనైజేషన్, పీఎంశ్రీ పాఠశాలలు, పీఎం జన్‌మన్ వసతి గృహాలు, ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు, నవోదయ ప్రవేశం, దసరా సెలవుల్లో విద్యార్థులు చేయాల్సిన కృత్యాలు, స్వర్ణాంధ్ర పోటీలు, స్వర్ణాంధ్ర సర్వే, స్వర్ణాంధ్ర సంగ్రహం తయారీ తదితర అంశాలపై డీఈఓ తిరుమల చైతన్య దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్, డిప్యూటీ డీఈఓ ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఏ ఈఈ డివి ఎన్ మూర్తి, ఎంఈఓలు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.